

కథ

# హద్దు

ఎ. ప్రభాకర్

'ఈ వూరే కాదు ఈ చుట్టుపక్కల పాతికూళ్ల కట్టుబాటిది. ఏంటంటే ఈ గూడకొంగల్ని ఎవరు చంపినా, కొట్టినా వాళ్లని రెండురోజులు ఈ చెట్టుకి యిలా కట్టేసి ఉంచడం... కొంగకి వెయ్యి రూపాయాల జరిమానా కట్టించడం... ఆ డబ్బుల్ని పంచాయితీకి కడతాం.

ఉన్నట్టుండి ఒక్కసారి పైకెగిరింది గూడకొంగ.

పెద్దవైన దాని రెక్కల గాలికి చెరువు నీరు సన్నగా కంపించింది.

పొడుగాటి కాళ్లని బద్దల్లా ఏటవాలుగా ఉంచుకొని కొంగ పైపైకి ఎగిరింది.

మెడని పొడుగ్గా ఉంచి నోరు తెరిచి హుర్... అని అరిచి చెరువు మీదే రెండుసార్లు గిరికీలు కొట్టింది.

చెరువు ఒడ్డునే ఉన్న రావిచెట్టు మీద వాలబోతూ పురుక్ మని రెట్ట వేసింది. అది తిన్నగా వెళ్లి అప్పుడే గట్టెక్కబోతున్న బూరయ్య భుజం మీద పడింది.

'ఛీ... నీయవ్వ...' అనుకుంటూ పైకి చూసాడు బూరయ్య. కొంగ కొమ్మ మీద వాలి సిగ్గు పడుతున్నట్టుగా మెడని బాగా వొంచుకొని ముడుచుక్కూర్చుంది. బూరయ్య మళ్ళీ గట్టు దిగి చెరువులోకి దిగి కడుక్కున్నాడు. పైకి వచ్చి గట్టెక్కాడు.

"ఏమంటున్నారు కుర్రాళ్లు" అన్నాడు అక్కడున్న వారితో.

రావిచెట్టు చుట్టూ సిమ్మెంటుతో చేసిన విశాలమైన గట్టు ఉంది. అది అక్కడక్కడా పెచ్చులు లేచి పొయి ఉంది. గట్టుమీద ఆదినారాయణ, సోమరాజు కూర్చొని ఉన్నారు. ఇంకా వూళ్లో వాళ్లు కొంతమంది కూర్చుని- కొంతమంది అష్టాచెమ్మా ఆడుకుంటూ వున్నారు.

చెట్టు మొదలుకి ఇద్దరు కుర్రాళ్లు కట్టేసి ఉన్నారు. కాళ్లు రెండూ తాడుతో కట్టేసి ఉన్నాయి. వాళ్ల ముఖాలు ఆరిపోయిన పిడకల్లా ఉన్నాయి. పాంటు చొక్కాలు వేసుకున్న ఆ కుర్రాళ్లు పట్నం వాళ్లలానే ఉన్నారు.

వాళ్ల కాళ్ల దగ్గర కాస్త పెద్దగా ఉన్న నాలుగు కొంగలు పడి ఉన్నాయి. వాటి ముక్కుల దగ్గర నల్ల చీమలు తిరుగుతున్నాయి. ఆదినారాయణ ఆ చీమల్ని వుఫ్పని వూదుతూ..

"తెలక చంపాం బాబూ వొదిలేత్తే మళ్లీ యిటుకాసి సచ్చినా రామంటున్నారు" అన్నాడు.

బూరయ్య ఏమీ మాట్లాడకుండా ఆ కుర్రాళ్ల దగ్గరగా వెళ్లి వాళ్లని పరిశీలనగా చూసాడు. చూసి

"చూడబోతే చదువుకున్న వాళ్లలానే ఉన్నారు. నోరులేని పక్షులు... వాటినెందుకు చంపారయ్యా!" అన్నాడు.

అందులో ఒక కుర్రాడు కొద్దిగా వొణుకుతున్న గొంతుతో,

"నిజంగా సార్... మాకసలు ఇలాంటి రూలుందని తెలీదండీ... ఇక్కడ తోటల్లో ఈ సీజన్లో కొంగలుంటాయిరా... కొట్టుకొద్దామంటే కొంగలే కదా అని వచ్చానండి.. అంతకన్నా నాకేమీ తెలియదండీ... ప్లీజ్ ఈసారికి వదిలేయండి" అన్నాడు.

రెండో వ్యక్తి,

"అయినా కాపోయినా యిదేటండి బాబు దార్న పోయే కొంగల్ని కొట్టినా తప్పేనా!" అన్నాడు.

బూరయ్య అతనికేసి కోపంగా చూసాడు.

"దార్న పోయే కొంగలు కదా... అవి నీ జోలికొచ్చినయ్యా... సొంటికొచ్చినయ్యా.. మరెందుకు వాటిని చంపావ్?"

అతడు తడబడిపోతూ 'అదికాదండి... మీ వూళ్లో యిలాంటి రూలుందని తెలీక..."

అతని మాటల్ని ఆపుతూ, "అదే అంటున్నాను యిక్కడీ రూలుందని చంపవు. రూల్లేని ఊళ్లోకెల్లి చంపుతావా? అసలు వాటిని చంపాల్సిన అవసరమేటని"

అతను మిడిగుడ్లేసుకుని ఉండిపోయాడు.

"ఆటి మానానికి అవి ఎగురుతూ వాలుతూ ఉన్నాయి. చూడు ఎంతందంగున్నాయో... చేతులెట్లా వచ్చినైరా మీకు" అన్నాడు సోమరాజు.

"ఏది దొరికితే దాన్ని కోసుకుని తినేడమే.. ఆ పిట్టేటి... దాని బతుకేటి అని తెలుసుకోవడం లేదు" ఆదినారాయణ.

"ఈళ్లకి తెలక చేసిన పనికాదురా బాబూ... శీతాకాలంలో ఈ కొంగలు యిక్కడికి వస్తాయని ఈ జిల్లాయే కాదు... మొత్తం దేశమంతా తెలుసు. అయినా ఏట్లే... చంపితే ఎవడడుగుతాల్లే అని" సోమరాజు.

కుర్రాళ్లు నిశ్శబ్దంగా ఉండిపోయారు.

కొద్దిసేపు అలా వున్న తరువాత బూరయ్య వాళ్లని చూస్తూ

'ఏ వూరు మన్ది'

'రాజమండ్రండి'

'ఏం చేస్తారు'

'ఏదో చిన్న బిజినెస్ అండి'

'నీ పేరేటి'

'రాజ్‌కుమార్'

'అతను'

'వరప్రసాద్'

'ఎప్పుడూ యిలా వేటకి వెళ్తారా?'

'ఈ సైడెప్పుడూ రాలేదండి బాబు... ఎప్పుడైనా వెళ్తే మన్నెం కేసి వెళ్లమే'

కాసేపు వూరుకున్నాకా

రాజ్‌కుమార్ అడిగాడు 'యిప్పుడు మమ్మల్ని ఏం చేస్తారండి'

బూరయ్య నవ్వాడు.

'గూడకొంగల్ని ఎవరు చంపినా కొట్టినా వాళ్లని ఈ చెట్టుకి రెండు రోజులు కట్టేసి ఉంచుతాం. కొంగకి వెయ్యి రూపాయల వంతున జరిమానా కట్టాలి. అదీ శిక్ష' అన్నాడు.

'చచ్చాం' అన్నాడు వరప్రసాద్.

రాజ్‌కుమార్ అన్నాడు.

'కావలిస్తే కొంగకి రెండు వేలిస్తాం... మమ్మల్ని వదిలేయండి బాబు'

'బాగా పులిసున్నాడు ఎదవ కొడుకు' అన్నాడు ఆదినారాయణ. అని 'యేలకేలు కట్టీగలవే... సచ్చిందానికి రేటు కడతావా ఎదవా..." అన్నాడు మీదికెళ్లి.

'అదేటండీ బాబూ రెండువేలంటే మేకపోతే వచ్చేద్దికదా' అన్నాడు వరప్రసాద్.


'అది మాంసం కాదురా ఎదవా...' నేలమీద పడున్న కొంగల్ని చూపిస్తూ 'అవి పక్షులురా... పైగా అవి యిక్కడివి కూడా కాదు' అన్నాడు ఆదినారాయణ.

'అదీ వూర్కో..' అని ఆపాడు బూరయ్య.


గట్టుమీద కూర్చున్నవాళ్లందరూ చూస్తున్నారు. వూళ్లోంచి గుంపులు గుంపులుగా వచ్చి చెట్టు చుట్టూ చేరారు. చచ్చి పడున్న కొంగల్ని చూసి చ్చొచ్చొచ్చొ అంటూ కట్టేసున్న వాళ్లని తిడుతున్నారు. ఆదినారాయణ, సోమరాజు ఇంకా కొంతమంది కుర్రాళ్లు వచ్చి కిందపడున్న కొంగల్ని తీసుకున్నారు. అంతా కలిసి వూరేగింపులా కాస్తంతా దూరంలో ఉన్న ఖాళీ స్థలంలోకి వెళ్లారు. అక్కడ అంతకు ముందే పెద్ద గొయ్యి తవ్వి ఉంది. కొంగల్ని ఆ గోతిలో వేసి పూడ్చి పెట్టారు. మళ్లీ వచ్చి చెట్టు చుట్టూ కూర్చున్నారు. కొంతమంది ఊళ్లోకి వెళ్లిపోతున్నారు. బూరయ్య అందర్నీ తేరిపార చూసాడు. కట్టేసున్న కుర్రాళ్లని చూస్తూ-

'ఈ వూరే కాదు ఈ చుట్టుపక్కల పాతికూళ్ల కట్టుబాటిది. ఏంటంటే ఈ గూడకొంగల్ని ఎవరు చంపినా, కొట్టినా వాళ్లని రెండురోజులు ఈ చెట్టుకి యిలా కట్టేసి ఉంచడం... కొంగకి వెయ్యి రూపాయాల జరిమానా కట్టించడం... ఆ డబ్బుల్ని పంచాయితీకి కడతాం. యిది ఈ ప్రాంతపు కట్టుబాటు. ఈ కుర్రాళ్లేమంటున్నారంటే కొంగలే కదా కొడితే ఏటి తప్పూ అని. అంటే అవి ఎవరివీ కాదు కదా.. ఎవడూ అడిగే వాడు లేదు కదా...అని.. చూడండి బాబూ ఈ కొంగలు ఈ వూరికి ఏడాదికోమారు వచ్చే చుట్టాలు. రష్యాలోని సైబీరియా నించి అన్ని వేల మైళ్ల దూరం శీతాకాలంలో ఎగురుకుంటూ సరిగ్గా ఈ వూరికే వస్తాయి. ఆసియా దేశాలలో చాలా చోట్లకి పక్షులు వలస వస్తాయి.

**అభివృద్ధి అనీ... యంత్రాలనీ యిప్పటికే పర్యావరణాన్ని ధ్వంసం చేసేసారు. అడవుల్ని నరికేయడం, కొండల్ని తవ్వేయడం... దీనివల్ల నిజానికి జనానికొచ్చిన లాభమేంటి? ఎవడో ఒక పారిశ్రామికవేత్తో, విదేశీ కంపెనీయో కోట్లకి పడగలెత్తుతోంది. భూగోళం ఏమైపోతుంది అనే బెంగలేదు.**



ఈ వూరికి వచ్చిన పక్షులు అదిగో ఆ తోపుంది చూసారా... ఆ చింత చెట్లు, వెలగ చెట్లు వాటిమీద వెన్నముద్దల్లా వాలి ఉంటాయి. వాటి మీద గూళ్లు కట్టుకుంటాయి. అవొచ్చాయంటే చాలు ఈ వూరంతా వాటి రెక్కల చప్పుళ్లతో తిరనాళ్లయిపోద్ది. వాటి గురుకు గురుకు అరుపులు చంటిపిల్లల కేరింతల్లా ఉంటాయి. ఆ చెరువులోనూ ఎక్కడెక్కడికో వెళ్లి చేపలు, నత్తలు తింటాయి. పొలం దున్నుతుంటే మట్టిలో పురుగుల్ని తింటాయి. ఆ చెట్లమీద గూళ్ళల్లో గుడ్లు పెట్టి పిల్లని పొదుగుతాయి. అవి కాస్త పెద్దవగానే వాటికి రెక్కలు రాగానే అన్నీకలిసి మళ్లీ వాటి దేశానికి ఎగిరిపోతాయి. ఈ వలస పక్షులు మనిషి చుట్టాలు. ఈ వూరికి పురిటికొచ్చిన ఆడబిడ్డలు... అందుకే వాటిని మేం కంటికి రెప్పల్లా చూసుకుంటాం. వాటిమీద ఈగ వాలినా సహించం. మీలాంటి కుర్రాళ్లు వాటిని చంపి కోసుకుని తినేద్దామను కుంటారు. అది ఎంత అమానుషమైన విషయమో ఆలోచించండి. అవి ఎవరికీ ఆస్తులుకాదు. ఎవరికీ చెందినవి కాదు. కానీ అవి మన తోటి ప్రాణులు. వాటిని అవి కాపాడుకోలేని నిస్స హాయ విహంగాలు. అందుకే వాటిని మనమే కాపాడాలి.



**'అందుచేత మిమ్మల్ని రేపు సాయంత్రం వదిలేస్తారు. ఏం బెంగ పడకండి. అంతవరకూ మీ భోజనం గట్రా మా కుర్రాళ్లు చూస్తారు. ఇంకెప్పుడూ కొంగల్నే కాదు. ఏ పిట్టనీ జంతువునీ కొట్టకండి. ఆకాశమ్మీద పక్షి లేకపోతే ఎంత బోడిగా ఉంటుందో చూడండి... ఆలోచించండి"**

అందుకనే ఈ ప్రాంతంలో ఇలాంటి కట్టుబాటు ఏర్పాటు చేసాం" అని ఆగాడు.

అందరూ వింటున్నారు. ఈ మధ్య కాలంలో ఎప్పుడూ ఈ కొంగల్ని కొట్టింది లేదు. అందుకే అందరూ మూగిపోయి ఉన్నారు. వాటిని చంపడం గ్రామానికే కాదు ఆ ప్రాంతానికే అరిష్టమని అందరికీ తెలుసు. అందుకే రాన్రానూ జనం పెరుగుతున్నారు.

బూరయ్య తల పంకిస్తూ ఆ కుర్రాళ్లతో అన్నాడు. 'అందుచేత మిమ్మల్ని రేపు సాయంత్రం వదిలేస్తారు. ఏం బెంగ పడకండి. అంతవరకూ మీ భోజనం గట్రా మా కుర్రాళ్లు చూస్తారు. ఇంకెప్పుడూ కొంగల్నే కాదు. ఏ పిట్టనీ జంతువునీ కొట్టకండి. ఆకాశమ్మీద పక్షి లేకపోతే ఎంత బోడిగా ఉంటుందో చూడండి... ఆలోచించండి" అన్నాడు.

## 2

సుమారు ముప్ఫయి ఐదేళ్ల పాటు టీచరుగా ఉద్యోగం చేసి రిటైరయ్యాడు బూరయ్య మాస్టారు. చాగల్నాడులో అతను చాలా ఊళ్లలో పని చేసాడు. ఆ ప్రాంతంలోని ప్రతి వూరిలో కాస్త చదువు కున్న ప్రతివాళ్లు అతని శిష్యులే. ఆ ప్రాంతంలో అతను తిరగని వూరు లేదు. మహాత్మాగాంధీకి అతడు ఒక రకంగా భక్తుడు. వూళ్లో తనుకున్న తోటలో ఇంటిని కట్టుకుని దాన్ని ఆశ్రమంలాగా మార్చు కున్నాడు. యించుమించు నాలుగైదెకరాల తోట అది. జీడిమామిడి, మామిడి, వేప, నిమ్మ, నారింజ, దానిమ్మ, ఉసిరి, జామ, పనస, సపోటా, నేరేడు లాంటి అనేక చెట్లు ఆ తోటనిండా పెరిగి ఉంటాయి. కొంత స్థలంలో కందులు, చిన్న చిన్న మళ్లలో జొన్న, మొక్కజొన్న లాంటివి పండిస్తాడు. ఎలాంటి పురుగుమందులు, ఎరువులు వేయ కుండా మొక్కల్ని కూరల్ని పెంచుతాడు. ప్రకృతి జీవనం అంటే ప్రేమ.

ఆ తోటలో రెండు గదుల ఇల్లొకటి, ఒక గది ఒకటి విడివిడిగా కట్టుకున్నాడు. విడిగా ఉన్న గదిలో పుస్తకాలు తను వాడుకునే వస్తువులు వుంటాయి. ఊహ తెలిసిన దగ్గర్నుంచీ బూరయ్యకి ఒక రకమైన ఆదర్శాలని అనుసరించడం అలవాటైంది. బాగా నిరుపేదలు, యించుమించు అనాథలూ అయిన పిల్లల్ని తన దగ్గరుంచుకుని వాళ్లకి చదువు చెప్పడం అతను ఇరవై సంవత్సరాలనించీ చేస్తున్నాడు. అలా అతని సంరక్షణలో పెరిగి చదువుకున్న ఎంతోమంది పట్టణాల్లోనూ విదేశాల్లో కూడా ఉన్నారు. అతని ఇద్దరు పిల్లలు కూడా పెద్ద ఉద్యోగాల్లో ఉన్నారు. ప్రస్తుతం అతనూ అతని భార్య వీరలక్ష్మి ఇద్దరూ ఆ ఆశ్రమంలో ఉంటున్నారు. అతని దగ్గరికి చుట్టుపక్కల ఊళ్లలోని చిన్నా పెద్దా అందరూ వస్తూ వుంటారు. ప్రకృతి వైద్యం గురించి చిన్న చిన్న విషయాలు తెలుసుకుని వెళ్తూ ఉంటారు.

శీతాకాలంలో గూడకొంగలు వూరినిండా వాలడం, చుట్టుపక్కల తోటల్లో గుంపులుగుంపులుగా ఎగరడం బూరయ్యకి పసితనం నించీ తెలుసు. ఆ పక్షులు వూరి వాళ్లకి మల్లేనే అతనికీ అలవాటైపోయాయి. వాటిని కొట్టకూడదనీ, చంపకూడదనీ అవి తమ వూరికి అదృష్టాన్ని తెచ్చే దేవదూతలనీ వాళ్లు చెప్పుకునే కథలు... కట్టుబాటూ వాళ్ల జీవితంలో ఒక భాగంగా కలిసిపోయాయి.

పక్షులు ఎంత అలవాటైపోయినా ఎప్పుడూ ఏదో ఒక కొత్తదనం వాటిలో ఉంటుంది. అవి మెడని వంచే తీరు... గుండ్రంగా తిప్పు కోవడం, నాట్యభంగిమలా అడుగుల్ని తూచి తూచి వేయడం... మెడని ముందుకు చాచి బొమ్మలా ఉండిపోవడం, ఉన్నట్టుండి పైకెగర డం అన్నీ ఎప్పుడూ కొత్తగా అనిపిస్తుంటాయి. వాటివంక ఊరికే అలా చూస్తుంటే ఏదో అవ్యక్తమైన భావం ఒకటి గుండెల్లో కదులుతుంది. యివన్నీ బూరయ్యకి వయసుతో పాటు పెరుగుతూ వచ్చాయి.

ఆ వూరు అంతా కలిపి నాలుగైదొందల గడప ఉంటుంది. వూరు మొదట్లోనే రోడ్డు పక్కగా చాలా పెద్ద చెరువుంది. ఎప్పుడో చాళుక్యుల కాలంలో తవ్విన చెరువు. చెరువు పక్కనే గ్రామం కంఠంగా ఉన్న బంజరు భూమి ఉంది. అందులో చింత చెట్లు, రావి, వెలగ, వేప లాంటి చెట్లు దట్టంగా ఉండి చిన్న చిట్టడవిలా ఉంటుంది. అదే గూడకొంగల విడిది. వందలకొద్దీ కొంగలు వచ్చి ఆ తోటలోనూ వూళ్లోనూ గొడవగొడవ చేస్తాయి. వాటి రెట్టల గబ్బుతో వూరు గుప్పు మంటుంది. అయినా అవంటే వూరికి చుట్టుపక్కల పాతిక వూళ్లకి ప్రాణం.

## 3

రెండు మూడు వారాలుగా కారుమీద సూటూ బూటూ వేసుకున్న వ్యక్తులు ఆ గ్రామానికి వచ్చి చెరువు దగ్గర ఆగి ఆ ప్రాంతాన్నంతా పరిశీలిస్తున్నారు. చెరువు చుట్టూ తిరిగి ఏవేవో గుర్తులు పెట్టుకుంటు న్నారు. ఒకరిద్దరు కుర్రాళ్లు వాళ్లని ఏంటి విషయం అనడిగినా వాళ్లేదో హిందీలో మాట్లాడి వెళ్లిపోయారు. ఆ స్థలం అమ్మడానికి కొనడానికీ లేదు కాబట్టి అలాంటి వ్యవహారం ఏమీ కాదు కానీ ఏంటి వీళ్ల పని?

పంచాయితీ ఆఫీసులో అడగ్గా తెలిసింది. ఆ ప్రాంతంలో ప్రత్యేక ఆర్థిక మండలిని నిర్మించబోతున్నారు! దానికి సంబంధించిన పనులు చురుగ్గా సాగుతున్నాయి. విదేశాల్లోని ప్రముఖ కంపెనీలు అక్కడ ఎగుమతుల కోసం రకరకాల పరిశ్రమలు స్థాపిస్తాయట. అందుకోసం స్థలాన్ని సేకరిస్తున్నారు. చెరువు పక్కనున్న సుమారు రెండు వందల ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించేసింది. జిల్లాలో ప్రముఖుడైన పారిశ్రామికవేత్త ఆ కాంట్రాక్టు చేయబోతున్నాడు. ఆ ప్రైవేటు కంపెనీకి స్థలంతో పాటు గోదావరి నించి నీరు తీసుకోవడానికి అనుమతి నిచ్చారు. అందుకోసం అనేక చట్టాల్ని చేసారు. అనేక రుణాల్ని యిచ్చారు. పైగా వాళ్లు ఉత్పత్తి చేసిన వాటిని తప్పకుండా కొనే గారంటీ కూడా యిచ్చింది ప్రభుత్వం.

ఈ విషయాలు తెలియడంతోనే అన్ని వూళ్లలోనూ అలజడి రేగిపోయింది. అక్కడ ఎలా కడతారు? అక్కడే ఎందుకు కట్టాలి?

ఆదినారాయణ, సోమరాజు యింకా కొంతమంది బూరయ్య దగ్గర కొచ్చారు.

'ఈ ప్రాజెక్టు సంగతేమిటి మాస్టారు' అంటూ

'ఏంటో మరి అదే అర్థం కావడం లేదయ్యా! అంతా

నిర్ణయించేసారట. రేపో ఎల్లుండో పనులు కూడా మొదలు పెట్టేస్తారంట!"

'కానీ... ఆ చెరువు పక్కన కడితే... అక్కడి చెట్లన్నీ నరికి పారేస్తారు... మరి కొంగల సంగతేంటి?' అన్నాడు ఆదినారాయణ.

'ఏ వూరెళ్లినా యిదే గొడవండీ మాస్టారూ... ఇక్కడ కట్టకుండా యింకెక్కడైనా కట్టుకోవచ్చు కదా అని' సోమరాజు.

'అబ్బే యింకెక్కడైనా ఎలా కుదురుతుంది. కేంద్రంతో పోరాడి తెచ్చారట యిది' అన్నాడో వ్యక్తి.

'యిది నిర్మిస్తే మన జిల్లా బ్రహ్మాండంగా అభివృద్ధి చెందిపోతుంద టండి' అన్నాడు మరో వ్యక్తి.

బూరయ్య తలూపుతూ, "అభివృద్ధి అనీ... యంత్రాలనీ యిప్పటికే పర్యావరణాన్ని ధ్వంసం చేసేసారు. అడవుల్ని నరికేయడం, కొండల్ని తవ్వేయడం... దీనివల్ల నిజానికి జనానికొచ్చిన లాభమేంటి? ఎవడో ఒక పారిశ్రామికవేత్తో, విదేశీ కంపెనీయో కోట్లకి పడగలెత్తుతోంది. భూగోళం ఏమైపోతుంది అనే బెంగ లేదు. అయినా ఏం చేస్తాం? మన నెత్తిమీద ఆ తెల్లోడు దీన్ని రుద్ది పోయాడు. మనం బుర్ర వాచిపోయేలా అంటుకుంటున్నాం" అన్నాడు నిర్వేదంగా.

"మరైతే ఏం చేద్దాం మాస్టారూ ఏమైనా మన ఏరియాలో కొంగల్ని నాశనం చేసే ప్రాజెక్టులు మనకొద్దు" అన్నాడు సోమరాజు.

"పిచ్చోడా... అది మన కోసం కాదు కదా కట్టేది" ఆదినారాయణ.

కాసేపు మౌనంగా వున్నాకా బూరయ్య తల వూపుతూ "సరే! మనం చేతులు ముడుచుకుని కూర్చునేకన్నా దీని మీద ఏదైనా చేద్దాం. ముందు ఈ సమస్య గురించి కలెక్టర్నీ, మంత్రుల్నీ కలుద్దాం. వాళ్లకి వివరిద్దాం. వాళ్లేమంటారో విందాం. దాన్ని బట్టీ ఏదో ఒకటి చేద్దాం.." అన్నాడు.

ఇంచుమించు పదిరోజుల పాటు ప్రతి వూరినించి ఎవరో ఒకరు వచ్చి దీని గురించి బెంగగా మాట్లాడి పోయేవాళ్లు. పదూళ్ల నించి ఇరవై ముప్పైమంది పోగుబడి జిల్లా మంత్రితోనూ, కలెక్టర్‌తోనూ మాట్లాడారు. పరిష్కారం దొరకలేదు. తిరుగుళ్లన్నీ అయిపోయాయి. త్వరలోనే పని మొదలుపెట్టేస్తారు. దానికి ముందు ప్రజాభిప్రాయం సేకరిస్తాం అప్పుడు మీ సమస్యలు చెప్పండి అన్నారు వాళ్లు.

తన ఆశ్రమంలో మొక్కల మధ్య పని చేసుకుంటున్న బూరయ్య ఆలోచనలు దాని చుట్టూ తిరుగుతున్నాయి. తోటలోకి వచ్చి వాలిన పాలపిట్టల్ని గోరింకల్ని చూసాడు. పాలపిట్ట దానిమ్మ కొమ్మమీద వాలి చూసీ చూడనట్టు బూరయ్య వంక చూస్తోంది. దాని మెడ అటు తిరిగి ఉన్నట్టూ ఉంది. ఇటే వున్నట్టూ ఉంది.

ఈ పిట్టలు... అన్నీ ఏమైపోతాయి అనుకున్నాడు. మంత్రీ, కలెక్టరూ తమని చూసి వెటకారంగా నవ్వుకోవడం గుర్తొచ్చింది. 'కొన్ని తప్పవు మాస్టారూ... అభివృద్ధి జరగాలంటే మనం చెట్లగురించి పిట్టల గురించి ఆలోచించకూడదు' అని మంత్రి అనడం గుర్తొచ్చింది. ఏంటి తప్పవూ? ప్రకృతీ మనిషీ కలిసి ఉండలేవా? మనిషి ప్రకృతిని సర్వనాశనం చేస్తేనే పెరుగుతాడా... తను కూర్చున్న కొమ్మనే నరుక్కు పోతున్నాడు మనిషి. కింద ఉండి చెప్పేవాడు చవటలా... వెనకపడి పోయిన దద్దమ్మలా కనిపిస్తాడు పైన కూర్చున్న వాడికి. చేతిలోని గొడ్డలి తళతళలూ... తను పడుతున్న కష్టం... కొడుతున్న కొమ్ము... కొమ్మ తెచ్చిపెట్టే లాభాలూ... ఇవే కావాలి. ఆ కొమ్మ ఎప్పటికో విరుగుతుంది. ఈ లోగా వీడి లాభాలు వీడు పోగు చేసుకోవచ్చు.

ఇది అభివృద్ధికీ అభివృద్ధి కాకపోవడానికి సంబంధించిన సమస్య కాదు. మనిషి జీవించే పద్ధతికి సంబంధించిన సమస్య.

మనిషి కాస్తంత క్రమాన్ని పాటించగలిగితే యిలాంటి సమస్యే లేదు. కానీ కాళ్లకింద నేల కుంగిపోతున్నాసరే పైకి పోవాలనీ అదే పైకి పోవడమనే భ్రాంతి మనిషిని పట్టి వదలడం లేదు. అన్యమనస్కంగా అలా పని చేస్తూనే ఉన్నాడు.

**4**

ప్రత్యేక ఆర్థిక మండలి నిర్మాణంపై ప్రజాభిప్రాయ సేకరణకోసం బహిరంగ సమావేశం ఏర్పాటు చేసారు. పంచాయితీ ఆఫీసు దగ్గర అంతా కోలాహలంగా ఉంది. జిల్లా కలెక్టరు, ఆర్డీవోలు, ఎమ్మార్వోలు, ఎమ్మెల్యే, జిల్లా మంత్రి ఇంకా చిన్నా చితకా నాయకులందరూ వేదిక మీద కూర్చోనున్నారు. సమావేశం చుట్టూ వందల సంఖ్యలో పోలీసులు ఉన్నారు. అప్పటికే ఆ చుట్టుపక్కల పాతిక వూళ్ల పంచాయితీలలో ప్రాజెక్టు ఈ ప్రాంతంలో కట్టవద్దని తీర్మానాలు చేసి ప్రభుత్వానికి పంపారు. అటు రాజమండ్రిలో కూడా కొంతమంది పర్యావరణ ప్రేమికులు దీనిపై ఆందోళన చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సులువుగా అయిపోతుందనుకున్న వ్యవహారం కాస్తా జటిలమైపోయే సరికి మంత్రీ, కలెక్టరూ కొంత చిరాగ్గా ఉన్నారు. మంత్రికి, అధికార పార్టీకీ చెందిన కొంతమంది యువకులు ప్రాజెక్టు రావాలని, అడ్డుకునే వాళ్లని అభివృద్ధి నిరోధకులనీ ప్రదర్శన చేసారు. యిలా రెండు రకాల ఉద్యమాలు బయలుదేరడంతో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది.

మంత్రి మైకు దగ్గరకొచ్చి మాట్లాడడం మొదలు పెట్టడంతో సద్దు మణిగింది.



"ప్రియమైన ప్రజలారా... మొట్టమొదట ఒక విషయం ప్రస్తావనకి తేవాలి. మీకు తెల్సు... మా స్వగ్రామం ఈ పక్కనే ఉన్న రాజానగరం. ఈ ప్రాంతం గురించి.. ఈ ప్రాంతపు సంప్రదాయాల గురించి నాకు పూర్తిగా తెలుసు. గోదావరికి అవతల డెల్టా ప్రాంతం ఎంతగా అభివృద్ధి చెందిందో మీకందరికీ తెల్సు. కాటన్ పుణ్యమా అని అక్కడ బ్యారేజీ కట్టడంతో గోదావరి పొలాల్లోకి వచ్చింది. లక్షలాది ఎకరాలు పంట పొలాలై కోట్లాది రూపాయల ఆదాయం పెరిగింది. ఎటుచూసినా పచ్చని చేలు. తాగునీరు... సాగునీరు... సంవత్సరానికి మూడు పంటలు... కానీ మన ప్రాంతం? ఈ చాగల్నాట్లో వేసంకాలం వొచ్చిందటంటే మంచి నీళ్లకి ఎంత కరువో నేను మీకు చెప్పనక్కర్లేదు. కాలవ కింద వూళ్లవాళ్లు మనకి పిల్లనివ్వట్లేదంటే మన ప్రాంతం ఎంత వెనుకబడి ఉందో వేరే చెప్పాలా? యిలా ఎంతకాలం? ఎంతకాలం మనం అభివృద్ధికి దూరంగా ఉండిపోవాలి? చదువులో... డబ్బులో... అన్నింట్లో వెనకబడిపోతున్నాం. దీన్నించి మనం బయటపడాలి. మన ప్రాంతం అభివృద్ధి చెందాలి. దానికోసం మనం త్యాగాలకీ, కఠినచర్యలకీ వెనుకాడకూడదు. అందుకనే ప్రభుత్వం ఈ ప్రాజెక్టు ప్రతిపాదన చేసినప్పుడు యితర రాష్ట్రాల వాళ్లు పోటీపడ్డా... మేం పోరాడి ఈ ప్రాజెక్టు మనకు వచ్చేలా చేసాం(చప్పట్లు). యింత చేసాకా నోటికాడ కూడు తన్నేసినట్టు కొంతమంది అభివృద్ధి నిరోధకులు ఏవేవో కుంటిసాకులు పెట్టి ఈ ప్రాంతం అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తున్నారు. వాళ్ల ఆటలు సాగనివ్వం మేం. ఈ ప్రాంతం అభివృద్ధి కోసం మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. అభివృద్ధి కోసం మేం ప్రాణాలివ్వడానికైనా సిద్ధంగా ఉన్నామని మీకు తెలియజేస్తున్నాను. మీరు స్వార్థపరుల మాటల్ని నమ్మకండి. సత్యాసత్యాలు తెలుసుకుని ప్రభుత్వానికి సహకరించమని కోరుతున్నాను" అని కూర్చున్నాడు.

జనంలో గోల మొదలైంది. మంత్రి అన్యాపదేశంగా ఎవర్ని విమర్శిస్తున్నాడో... ఎవరికి హెచ్చరికలు చేస్తున్నాడో అర్థమౌతూనే ఉంది. కింద నినాదాలు వినిపిస్తున్నాయి.

(మిగతా వచ్చేవారం)

**"మరైతే ఏం చేద్దాం మాస్టారూ ఏమైనా మన ఏరియాలో కొంగల్ని నాశనం చేసే ప్రాజెక్టులు మనకొద్దు" అన్నాడు సోమరాజు.**

**"పిచ్చోడా... అది మన కోసం కాదు కదా కట్టేది" ఆదినారాయణ.**